# ఒకటే చీర

"నీవు తిని వచ్చిన తరువాత నేబోయి తినివత్తునుగాని, ముందు నీవేళ్ళి తినిరా, చీకటి పడినను నాకు భయము లేదు" అని అత్తయనెను.

అచ్చరవయినను పిశాచముగా చేసి నైచుకోక కట్టుకొని కూర్చున్న కోడలొక్క నిమిషమాలోచించి— "కాదు కాదు, మీరే ముందు వెళ్ళవలయును. మీరు వచ్చిన తరువాతనే నేను" అని అనెను.

"మానమును మరియదయు ఎక్కువ వారికి గాని మము బోటి తక్కువ వారికి గావమ్మా, కాబట్టి ఆ సంగతి వదిలిపెట్టు. నీకు మధ్యాహ్నము కూడా కూడు లేదు. పైగా చిన్నదానవు. చీకటిలో ఆ గుంపులో త్రోసికొని వచ్చుటయు ప్రమాదము" అని అత్తయనెను.

"మానమును మరియాదయును గాలియు నీళ్ళ వంటివత్తా! తండ్రియును, కొడుకును తిని పదకొండు గంటలకే నాగరాజుగారి ఇంటికి వెళ్ళిరి కదా! మీకు మాత్రము మధ్యాహ్నము కూడేది? కాబట్టి ముందర మీరే వెళ్ళిరండు, తరువాతనే నేను వెళ్ళుదును. చీకటియనియు, గుంపనియు నాకొక దయ్యము చూపితిరి. దయ్యములు నన్నుమాసి పారిపోవును" అని కోడలనెను.

"కాదమ్మా! నీకు పచ్చ పసుపు పోసినటులు, మెరుపులు ముద్దచేసి నటులుందువు. నీకు దృష్టి తగులునమ్మా, మరి చెప్పను". "మీమాటయే నిజమగుగాక! మెరుపులు ముట్టినచో దెబ్బ తగులు నత్తా. దానికేమి గాని ముందు మీదే వంతు"

కోడలు మిగుల వినయవిధేయతలు కలది. అత్త మాటకెన్నడు నెదురాడి యెరుగదు. ఆడుచో, మరి వింధ్య పర్వతమే. ఈ సంగతి ఆ యత్తకు తెలియును. కాబట్టి ఇక లాభము లేదనుకొని అత్త తన అతుకుల బొంత విడిచి అటకమీది చీర తీసి కట్టుకొని నాగరాజుగారి సత్రమునకు వెళ్ళెను.

ఆ బస్తీలో నెటు చూచినను నాగరాజు పేరే. నాగరాజు ఆసుపత్రి, నాగరాజు అనాధ శరణాలయము, నాగరాజు దేవాలయము, నాగరాజు కాలేజి, నాగరాజుసత్రము, నాగరాజు కొళాయి, నాగరాజు వీధి, వీధి? వీధి యేమి కర్మము? ఇక ఆ బస్తీ బస్తీ నాగరాజపురమై పోవచ్చును.

నాగరాజిపుడు పేదవారికి జావపోయుటకొక సత్రమారంభించెను. ప్రతిదినము సాయంకాలమారు గంటలకు నాంది. పది గంటలకు భరత వాక్యము. కష్టపడి సంపాదించుకొనువారు కూడా నిట దినమరగి సోమరులయి పోదురను సదుద్దేశముతోడనే ఇపుడతడు నూకల జావ పోయుటకేర్పాటొనరించెను. కష్టపడి సంపాదించుకొనగలవారికీ నూకల జావ తినుట అవమానమని అతని ఉద్దేశము. సోమరితనమును అవమానమును అన్నదమ్ములని అతడెరుగకపోవచ్చును. రోడ్డులకిరు ప్రక్కలనున్న మురికి కాలువల నీరు తగులకుండజనులు కడు జాగరూకతతో కూర్చుండిరి. దుమ్ము లేవకుండా రోడ్లమీద నీరు కొట్టిరి. నాగరాజు అండ్ సన్స్‌వారి బియ్యపు మరయందును, పిండి మరయందును, నూనె మరయందును, పంచదార మర యందును, పనిచేయు వారెందరో వచ్చి విస్తళ్ళ వేయదొడిగిరి. నాగరాజును, అతని కొడుకు గంగరాజును బంతుల వెంట దిరుగుచు అజమాయిషీ చేయుచుండిరి. కొందరు పచ్చడియు మరికొందరు ఉప్పును వేసుకొనుచు పోవుచుండిరి. తరువాత నూకల జావ వచ్చెను. అది పేరునకు జావ. అర్థమునకు జారుముద్ద.

దరిద్ర నారాయణులందరును దంత యంత్రములు విప్పిరి "ఇక నొక యేడాది వరకును తిండిలేక చావ" మనుధైర్యమువారి మొగములలో కనబడుచుండెను. గ్రుడ్డివారందరును నాగరాజును చూడవలయుననియు, కుంటివాండ్రందరును నాగరాజు ముంగలికి పరువెత్తి జే పెట్టవలయుననియు దలచుచుండిరి. అంగవైకల్యము లేని వారందరును నాగరాజును, అతని కుమారుడును తమ నడుమ నుండి పోవుచుండగా తలలు వంచుకొనుచుండిరి.

తన ఇంటి చుట్టును నలువైపుల నున్న రోడ్లనడుమ నడచుచు, ఈ దరిద్రనారాయణుల జూచుచున్న నాగరాజు హృదయము బరువెక్కెను. శిల్ప సంపదతో, రస పురుషుని దెలుపు తనపాలరాతి మేడ చుట్టును కూర్చున్న ఈ జీవచ్ఛవములను జూచుచున్న నాగరాజుకు సృష్టి చేయు బ్రహ్మకీ విశ్వము నిండ శవములు కనిపించుచో నెటులుండునో అటులుండెను. అతడు వడివడిగా ఆ రోడ్డుదాటి ఎడమవైపు రోడ్డు మీదికి తిరిగెను. అచట బంతులన్నియు పూల మొక్కలు పాతిన చందముగా నుండెను. అతని కంటికి కొంచెము శాంతి దొరకెను. నడచుచు నడచుచునున్న వాడచట ఆగి అచట కూరుచున్నవారి నందరను పరికించెను. పలువురు తన మిల్లులో పనిబుగులవారే. "వీరు కూడా ఇచటికేల వచ్చిరి?" అని అతడనుకొనెను. ఇక నిలిచినచో బాగుండదు. వారందరాడువాండ్రు. అతడు మెల మెల్లగా పది అడుగులు నడచెను. అచట వింత తోడను వెగటు తోడనుఅతడాగి పోయెను—మాతరమ్మ ప్రతిదినమును తన ఇంటికి పాలు తెచ్చిఇచ్చును. బియ్యపు మరలో కూలిది.

మాతరమ్మ జావముద్ద తినుచున్నది. అతడాచి చూచెను. మాతరమ్మయు జూచెను. ఆమెలోనెక్కడేని ఏ మాత్రమేని సందియము లేదు. తన హక్కును తాను వృధా చేయకుండ వినియోగించుకొనుచున్న చందముగా తినుచు లోలోపల నాగరాజునకు మ్రొక్కు చున్నది. కొడుకును పిలిచి సరిగా వినియోగము చేయింపుమని చెప్పి నాగరాజు మేడలోనికి వెళ్ళిపోయెను. "అప్పుడే వచ్చితిరేమి? దరిద్ర నారాయణ సేవ సమాప్తమా?" యని యతని భార్య యోగమాయ ప్రశ్నించెను.

"ఇది సేవకాదు, పరీక్ష"

"నారాయణునికి పరీక్షయా?"

"ఆ దరిద్ర నారాయణ పరీక్ష. ఈ గుంపులో మన మిల్లుల పని వాండ్రు కూడా పలువురు దూరిరి. వారికేమి రోగము? వారిలో ఒకొక్కతె ఎటువంటి చీర కట్టుకొని వచ్చినదో ఒకపరి చూడు. వైస్రాయి విందుకు వచ్చినట్లు మాతరమ్మయు వచ్చినది. నీవు కూడా అంత విలువగల కోక కట్టవు. నీవెప్పుడో అట్టికోక కట్టినటులు గురుతు? యోగమాయ కొంచెము సిగ్గుపడి ఇటులనెను "సరిసరి మాతరమ్మయు నామె కోడలు జయయు, ప్రతిదినమును మిల్లుకు వచ్చుచు దగ్గర ఉండి పాలు పిండించి మనకు తెత్తురు. ఒకనాడు నేనే పాలగిన్నె తీసుకొనవలసి వచ్చెను. ఆమెను చూతును గదా గుడ్డలమ్మ బీరువా తీయగనే ఒక చీర కనబడెను. అది కట్టించి ఆమెనపుడు మిల్లుకు పంపితిని. వాండ్లు చాలా మంచి వాండ్లు"

"మంచి వాండ్లగుచో నిక్కడికేలవత్తురు? పేదలకు సత్రముగాని వీరికా? వీరికి మనము జీతములిచ్చుట లేదా?"

"ఏమిచ్చుచున్నారు?"

"నాకు గురుతా? గుమాస్తా నడుగు"

'మీరిచ్చునది తమకు జాలినచో మాతరమ్మ వచ్చినను సత్రమునకు రాదు"

"ఆడు వాండ్రమీద నీకభిమానము"

"ఒకవేళనున్నచో అది మీరనుకొనినటులు తప్పు కాదు గాని, మీరిచ్చు జీతము వారి కుటుంబమునకు చాలదు. అది అటులుండగాక. నాకు కూడా మీ సత్రమువున వారితో పాటు తిని రావలయునని సంకల్పము కలుగుచున్నది"

"ఏమేమి?"


"ఇపుడొకడే దరిద్రులకు ప్రతినిధిగా మోకాలు దిగని కొల్లాయి కట్టుకొనుచుండగా నేనొక యేడాది పాటు దరిద్రుల దుఃఖమెంతయో కనుగొనుటకు నూకలు కూడు తినజాలనా? అదియుగాక కాయకష్టమొనరించి మన సంపదలో కొంతయు గానున్నను కొంతకు కారణమైన మన ఈ కూలివాండ్ర తరువాతనే ఈ దరిద్రులు. మన గుమాస్తాల తరువాతనే ఈ దరిద్రులు

హేతుపూర్ణమైన ఈ వాక్ప్రవాహపుటురవడికి నాగరాజు మనస్సు చాలా దవ్వుకొట్టుకొనిపోయెను.

సరిగా ఆ సమయమునకు మాతరమ్మ వారి ముందరికి వచ్చికొంచెము వెనుకకు తగ్గి తలుపు చాటున నిలువబడెను.

నాగరాజు కొంచెము బిడియపడి మేడమీదికి పోబోయి గదిలోనికి మరలెను.

వేలూరి
శివరామశాస్త్రి




"కోడలిని దీసికొని రాకుండ నీ వొక్కతెవే వచ్చితి వేమి?" అని యోగమాయ అడిగెను. "చీరెర్... అని ఆగిపోయి కొంచెము సిగ్గుపడి వేదననుభవించి మాతరమ్మ మరల నందుకొని "మేమిరువురమును వచ్చుచో ఇంటికాడెవరు? నేను వెళ్ళుచునే పంపెదను. దానికి మధ్యాహ్నము కూడా కూడు లేదమ్మా" అనియనెను.

"సరి నాకు గనపడి పొమ్మని చెప్పు?"

"నేను చెప్పనక్కరలేదు. దానికి తెలియును" అనుచు మాతరమ్మ వడివడిగా వెళ్ళిపోయెను.

మాతరమ్మ వెళ్ళిన గంట తరువాత కోడలు జయ ఏ రోడ్డు మూలనో కూరుచుండి ఆకలి పోగొట్టుకొని కలకలలాడుచు యోగమాయ ఎదుటికి వచ్చిదండము పెట్టి నలువబడెను. గదిలో మీ బాబుగారున్నారు. ముందు వారికి దణ్ణము పెట్టవలెను" అని యోగమాయ అనెను.

జయనోరు కరచుకొని, తెరచిన గుమ్మము ముందు వంగి నమస్కరించుచుండగా నాగరాజు వచ్చి చూచెను. మరల నదేచీర. మాతరమ్మ కట్టుకొనినదే.

అతని నోటి నుండి గబగబ ఈ మాటలు దొరలెను "ఇట్టి చీరలు మీ ఇంట ఎన్నికలవు?"

జయ భయపడెను. అత్తగారు చావనయినా చచ్చును గాని దొంగతనము చేయదని జయకును తెలియును. అంతనామె భయము తొలగెను: పిదప ఇటులనెను—"అమ్మగారు పదిరోజులక్రింద మా అత్తగారికీ కోక ఇచ్చిరి. అదే అక్షయముగానున్నది"

"మీరిరువురును కలిసి రాక నీవు వెనుక వచ్చితి వేమి?"

జయకు నవ్వును దుఃఖమును వచ్చెను. "అయ్యా నేనిపుడు తమ సన్నిధానములో మనవి చేసుకొనినదదే. అందులకనియే మేమిరువురమును మిల్లుపనిలోనికి రాజాలకున్నాము. ఆమె ఒకరోజును నేనొక రోజునను వచ్చుచుందుము అందువల్ల..."

జయమాటలు విని నాగరాజు రిచ్చపడిపోయెను.

●